గురుకులంలో ఎలుకల కలకలం

- కీసరలో విద్యార్థినులను కరిచిన ఎలుకలు
- దవాఖానలో చికిత్స పొందుతున్న ఐదుగురు బాలికలు
- విద్యార్థులను పట్టించుకోని దుస్థితిలో ప్రభుత్వం: హరీశ్‌రావు

ఎలుకలు కరవడంతో దవాఖానలో టీకా వేసుకున్న విద్యార్థినులు

మేడ్చల్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మహాత్మా జ్యోతిబాపూలే బాలికల వసతి గృహంలో ఎలుకలు కొరకడంతో ఐదుగురు 10వ తరగతి విద్యార్థినులు గాయపడ్డారు. ఘటనపై హాస్టల్ సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా విద్యార్థినులను కీసర ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇప్పటికే గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలతో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన విషయం బయటకు రాకుండా చూసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం గురుకులాలపై దృష్టి పెట్టకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. వసతిగృహంలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఎలుకలు వస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు. విద్యార్థులను ఎలుకలు కరిచిన విషయం తల్లిదండ్రులకు కూడా చెప్పకుండా గోప్యత పాటించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. వసతిగృహంలో 1280 మంది బాలికలు చదువుతున్నారని, వారికి తగిన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఎలుకలు కరిచాయని విద్యార్థులు చెబుతున్నా మామూలు దద్దుర్లు వచ్చాయని ప్రిన్సిపాల్ మహాలక్ష్మి అంటున్నారు.

ప్రచారం పేరుతో తమాషా ఆపండి: హరీశ్‌రావు

కీసరలో విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. విద్యార్థినులు దవాఖాన పాలుకావడం దారుణం అని, కాంగ్రెస్ పాలనలో ఎలుక కాట్లు, కుక్కకాట్లు, పాముకాట్లు కరెంట్ షాక్‌లతో విద్యార్థులు తల్లడిల్లుతున్నా ప్రభుత్వం పట్టించుకోని దుస్థితిలో ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల గురుకులబాట కార్యక్రమం డొల్లతనం 24 గంటలు గడవక ముందే బయటపడిందని విమర్శించారు. ప్రచారం పేరిట ఒక్కరోజు తమాషా చేయడం మానుకుని, గురుకులాల్లో విద్యార్థుల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌పై నిరసన పాట

జగిత్యాల, డిసెంబర్ 16 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, మోసం చేసి అధికారంలోకి వచ్చిన తీరును వివరిస్తూ పాట పాడారు. 'అందరినీ మోసం చేసి రేవంత్‌రెడ్డి.. కచ్చీరు ఏలుతున్నడే రేవంత్‌రెడ్డి' 'నాలుగు వేల పింఛినాని రేవంత్‌రెడ్డి.. అందరినీ మోసం చేసి రేవంత్‌రెడ్డి' 'అందరినీ మోసం చేసి రేవంత్‌రెడ్డి.. అందరినీ కాడు వెట్టనే రేవంత్‌రెడ్డి' అని పాడుతూ నిరసన తెలిపారు. ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హామీ ప్రకారం రూ.10 వేల గౌరవ వేతనం, మెనూ చార్జీలు ఇవ్వాలని కోరారు. బిల్లులు విడుదల చేయకుండా వండటం ఎలా? అని ప్రశ్నించారు.

- ఏడాదైనా 'రైతుభరోసా' ఏదీ?

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన తరహాలో రైతుభరోసా ఏదని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఖమ్మం రూరల్ తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఐ, రైతు సంఘం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. రైతు భరోసాపై కాంగ్రెస్ సర్కార్ ఏడాది కాలంగా ఊరిస్తున్నదని, వాయిదాలతోనే కాలం వెళ్లదీస్తున్నదని మండిపడ్డారు. – ఖమ్మం రూరల్

- మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

తమకు రూ.10 వేల వేతనం అమలుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట సోమవారం 48 గంటల ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బ్రహ్మచారి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. – కొత్తగూడెం ఎడ్యుకేషన్

అమ్మో హాస్టల్‌లో ఉండలేం!

- ఫుడ్‌పాయిజన్‌పై విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- తాండూరు గురుకులంలో ఘటనపై మండిపాటు
- దవాఖాన నుంచి 9 మంది విద్యార్థుల డిశ్చార్జి
- మరో ఇద్దరు విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స

దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు వైశాలి, రక్షిత

తాండూరు, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): " నేనురాను బిడ్డో సర్కారు దవాఖానకు" అని ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలు భయపడేవారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాలకు ఆ దుస్థితి వచ్చింది. గురుకులాల్లో వరుసగా జరుగుతున్న ఫుడ్‌పాయిజన్ ఘటనలతో తల్లిదండ్రులు తమ పిల్లలను వసతిగృహాలకు పంపేందుకు భయపడుతున్నారు. పెట్టా, బేడా సర్దుకుని పిల్లలను ఇండ్లకు తీసుకెళ్తున్నారు.

ఏమో నమ్మకం లేదు సారూ!

వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న 11 మంది విద్యార్థుల్లో 9 మంది సోమవారం డిశ్చార్జి అయ్యారు. మరో ఇద్దరు విద్యార్థులు మాతాశిశు కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. డిశ్చార్జి అయిన విద్యార్థులను తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. పిల్లలు అస్వస్థతకు గురవడంతో తీవ్ర ఆందోళన చెందామని, వారు కోలుకోవడంతో ఊపిరి పీల్చుకున్నామని చెబుతున్నారు. కానీ ఇప్పుడు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలకు పంపాలంటే భయమైతున్నదని అంటున్నారు. పాఠశాలల లోపలికి ఎవరూ వెళ్లకుండా గేటుకు తాళం వేసి, బయట పోలీసులు కూర్చోవడం ఏంటో అర్థం కావడం లేదని విమర్శిస్తున్నారు.

మెనూ పాటించని అధికారులపై చర్యలు

భువనగిరి అర్బన్ డిసెంబర్ 16: మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలను పాటించని అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. భువనగిరి పరిధిలోని హనుమాన్‌వాడలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. భోజనంలో కొత్త మెనూ పాటించక పోవడం, విద్యార్థులకు పెట్టే గుడ్లు కూడా సరిగా లేకపోవడం, విద్యార్థుల చేత పనిచేయించడం కలెక్టర్ దృష్టికి రావడంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుకు బదులుగా మజ్జిగ పెట్టిన తీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించి, డైనింగ్ హాల్‌లో కొత్త మెనూ బోర్డు ఏర్పాటు చేయకపోవడంపై మండిపడ్డారు. విద్యార్థులకు వడ్డించే డైనింగ్ హాల్ శుభ్రంగా లేకపోవడంపై కేర్ టేకర్ రమేశ్‌ను సస్పెండ్ చేయగా, ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

- దొంగచాటుగా సర్వేలెందుకు?

ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో భూములు, ఇండ్లు కోల్పోతున్న యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ బాధితులు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. అధికారులు దొంగచాటుగా సర్వేలు చేస్తున్నారని భూ నిర్వాసితులు మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. – చౌటుప్పల్

- కంది ధరలు తగ్గడంపై రైతుల ఆగ్రహం

కంది ధర తగ్గిపోవడంతో సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆందోళనకు దిగారు. శనివారం ఉన్న ధరకు సోమవారం క్వింటాకు రెండు వేలు తగ్గించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. – నారాయణపేట

- ఏడోరోజుకు ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల దీక్షలు

హామీలను అమలు చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు ఏడు రోజులుగా దీక్షలు చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. – నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్

మీటింగులకొస్తరు.. ఎన్నికల్లో ఎవరూ కనిపించరు?

- పాతబస్తీ శ్రేణులపై వీహెచ్ వివాదాస్పద వ్యాఖ్యలు
- రసాభాసగా కాంగ్రెస్ సమీక్ష

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): 'ఇప్పుడు మీటింగులకు బాగానే వస్తరు.. కానీ ఎన్నికలప్పుడు మాత్రం వీళ్లెవరూ కనిపించరు' అని పాతబస్తీ శ్రేణులపై కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీంతో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. గాంధీభవన్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జీలు దీపాదాస్ మున్షి, విష్ణునాథ్, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. కొందరు పార్టీ శ్రేణులు సమావేశాలకు ఊరేగింపుగా వచ్చి హంగామా చేస్తారు కానీ, ఎన్నికల సమయంలో మాత్రం ఎవరూ కనిపించరని, మజ్లిస్ పార్టీకే ఓట్లు వేస్తారని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. దీంతో అక్కడే ఉన్న పాతబస్తీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసినట్టు సమాచారం. మరోవైపు మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తన కుమారుడికి రాజ్యసభ ఇచ్చినంత మాత్రాన తనకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు.

మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభమై 25తో ముగియనున్నాయి. పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం విడుదల చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలుంటాయి. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 3 నుంచి 22వరకు నిర్వహిస్తారు. జనరల్, వొకేషనల్ కోర్సు విద్యార్థులకు సైతం ప్రాక్టికల్ పరీక్షలుంటాయి.

సెకండియర్ పరీక్షల షెడ్యూల్

తేదీ (రోజు)	పరీక్షాపేపర్
06-03-2025 (గురువారం)	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2
10-03-2025 (సోమవారం)	ఇంగ్లిష్ పేపర్-2
12-03-2025(బుధవారం)	గణితం పేపర్-2ఏ, బొటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్ -2
15-03-2025 (శనివారం)	గణితం పేపర్ -2బీ, జువాలజీ పేపర్ -2, హిస్టరీ పేపర్ -2
18-03-2025 (మంగళవారం)	ఫిజిక్స్ పేపర్ -2, ఎకనామిక్స్ పేపర్ -2
20-03- 2025 (గురువారం)	కెమిస్ట్రీ పేపర్ -2, కామర్స్ పేపర్ -2
22-03-2025 (శనివారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -2, బ్రిడ్జికోర్సు గణితం పేపర్ -2 (బైపీసీ విద్యార్థులకు)
25-03-2025 (మంగళవారం)	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ -2, జాగ్రఫీ పేపర్ -2

ఫస్టియర్ పరీక్షల షెడ్యూల్

తేదీ (రోజు)	పరీక్షాపేపర్
05-03-2025 (బుధవారం)	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1
07-03-2025 (శుక్రవారం)	ఇంగ్లిష్ పేపర్ -1
11-03-2025 (మంగళవారం)	గణితం పేపర్ -1ఏ, బొటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్ -1
13-03-2025 (గురువారం)	గణితం పేపర్ -1బీ, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్-1
17-03-2025 (సోమవారం)	ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్ -1
19-03-2025 (బుధవారం)	కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1
21-03-2025 (శుక్రవారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, బ్రిడ్జికోర్సు గణితం పేప -1 (బైపీసీ విద్యార్థులకు)
24-03-2025 (సోమవారం)	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1, జాగ్రఫీ పేపర్-1

- కరెంట్ లేక.. విద్యుత్ సిబ్బంది రాక

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నాలుగు రోజులైనా విద్యుత్ సిబ్బంది జాడ లేక పోవడంతో రైతులే మరమ్మతు కోసం తరలించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఈరవెన్నులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా రైతులు విద్యుత్ సిబ్బంది, అధికారులకు సమాచారం ఇచ్చారు. రైతులు కొనుకటి ఎల్లయ్య, కసరవేని నాగరాజు, కసర బోయిన ఇంద్రసేన, వర్రె సంపత్ సోమవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను విప్పి పాలకుర్తికి తరలించారు. – పాలకుర్తి

- మరుగుదొడ్డిలో సర్వే ఫారాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. నార్నూర్ మండలంలో 23 పంచాయతీలు ఉండగా.. నవంబర్ 1 నుంచి 31వ తేదీ వరకు సిబ్బంది వివరాలను నమోదు చేసుకున్నారు. 8,958 దరఖాస్తు ఫారాల్లో వివరాలను నమోదు చేశారు. వీటిని ఎంపీడీవో కార్యాలయంలోని బీరువాలో భద్రపర్చాల్సి ఉండగా ఎంపీడీవో కార్యాలయంలోని మరుగుదొడ్డిలో పడేశారు. – నార్నూర్

గ్రూప్-2లో బాబు భజన!

మొదటిపేజీ తరువాయి...

భిన్నమైన దుస్థితి. ఉద్యమ ద్రోహులదే చరిత్రగా చలామణి అవుతున్నది. చరిత్రగా చిత్రీకరించే ప్రయత్నం ముమ్మరంగా కొనసాగుతున్నది. అందుకు తాజాగా గ్రూప్-2 పరీక్షలో ఉద్యమ చరిత్ర పేపర్‌లో అడిగిన ప్రశ్నలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఉద్యమ చరిత్రను తక్కువ చేస్తూ, నాటి ఉద్యమ ద్రోహులకు సంబంధించిన అంశాలను ప్రస్తావించడమే అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఉద్యమ చరిత్రను చెరిపే కుట్రలకు అద్దం పడుతున్నది. సోమవారం నిర్వహించిన గ్రూప్ -2 తెలంగాణ ఉద్యమ చరిత్ర పేపర్‌లో ఏకంగా 13కుపైగా ప్రశ్నల్లో ఆంధ్రా ప్రాంతం, చంద్రబాబుకు సంబంధించినవే ఉండటం గమనార్హం.

ద్రోహుల చరిత్రకు పెద్దపీట

అనవాళ్లు చెరిపేస్తా, నిశాన లేకుండా చేస్తా నన్న రేవంత్‌రెడ్డి సర్కారు అన్నంతపనీ చేసింది. తెలంగాణ అసలు చరిత్రను చెరిపేసేందుకు పూనుకుంది. ద్రోహుల చరితను క్రమంగా తెలంగాణలో వ్యాప్తి చేయనున్నది. అదే అసలు చరిత్ర అని ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. చంద్రబాబు, రాయపాటి, కావూరి, లగడపాటి పచ్చి తెలంగాణ వ్యతిరేకులు. నరనరాన తెలంగాణ వ్యతిరేకతను ఒంటబట్టించుకుని రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన వారు. వీరిని తలచుకోవడం, వీరి కంపెనీల గురించి గుర్తుచేసుకోవడం దౌర్భాగ్యమని తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా ప్రాంతాలకు చెందిన కంపెనీలు, అది దివాలా తీసిన, బ్యాంకులను మోసం చేసిన కంపెనీలకు సంబంధించిన ప్రశ్నలిచ్చారు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదు అనడం వెనుక ఇదే కుట్ర దాగి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలుగు అకాడమీ పుస్తకాల్లో ఏపీ చరిత్రను తొలగించి పూర్తిగా తెలంగాణీకరించారు. ఇది టీజీపీఎస్సీ కాదు, టీడీపీఎస్సీ అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మొత్తం మీద చంద్రబాబు మీదున్న స్వామిభక్తిని రేవంత్‌రెడ్డి ఇలా చాటుకున్నాడంటూ సోషల్ మీడియాలో పలువురు పెట్టిన పోస్టులు వైరల్ అయ్యాయి.

అంతా బాబు భజనే

గ్రూప్ -2 పేపర్ చూస్తే తెలంగాణ ఉద్యమ చరిత్ర ప్రశ్నపత్రమా? లేక, టీడీపీ సన్మాన పత్రమా? అన్న అనుమానం రాకమానదు. గ్రూప్-2 క్వశ్చన్ పేపర్‌లో రేవంత్‌రెడ్డి పూర్తిగా చంద్రబాబు భజన చేయించాడు! రెండు కళ్ల సిద్ధాంతి చంద్రబాబుకు సంబంధించిన ప్రశ్నలను ప్రశ్నాపత్రం నిండా అచ్చొత్తించాడు! క్వశ్చన్ పేపర్ అంతా బాబు భజనను దగ్గరుండి చేయించినట్టున్నాడు! తెలుగుదేశం పార్టీ ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖ ఇచ్చిన విషయం అత్యంత ప్రధానమైన ప్రశ్న అట! చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్న సంగతి ప్రశ్నాపత్రంలో ఇప్పుడు గుర్తు చేయాల్సిన అవసరం ఏముంది? చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు విజన్-2020 డాక్యుమెంట్ తయారు చేసిన సంస్థ ఏదైతే మన కేంటి? ఆ విషయం ఇప్పుడు గ్రూప్-2 అభ్యర్థులను ప్రశ్నించాల్సిన అవసరం ఏమొచ్చింది? నిజాంసాగర్, కడెం ప్రాజెక్టులను ఎవరు నిర్మించారని ఈ టైంలో అడిగించడం వెనక కుట్ర ఏంటి? తెలుగుదేశం పార్టీ, తెలుగు గౌరవం లాంటి పదాలను బలవంతంగా ప్రశ్నాపత్రంలో చొప్పించడం వెనక ఉన్న ఎజెండా ఏంటి? కావూరి సాంబశివరావు, లగడపాటి, సుబ్బరామిరెడ్డి, రాయపాటి సాంబశివరావు పేర్లు తెలంగాణ గ్రూప్-2 ప్రశ్నపత్రంలో ఎందుకు ప్రత్యక్షమయ్యాయి? ఆంధ్రా రియల్ ఎస్టేట్ కంపెనీల పేర్లను గుర్తించి జతపరచాల్సిన ఖర్మ మనకెందుకు? అసలేం జరుగుతోంది? అన్న ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఏపీ వాళ్లకు కట్టబెట్టే కుట్రనా?

గ్రూప్ -2లో రెండో రోజు తెలంగాణ రాష్ట్రానికి అస్సలు సంబంధం లేని ప్రశ్నలు అడిగారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలించిన నేతల పేర్లతో పదుల సంఖ్యలో ప్రశ్నలు అడిగించారు. సంబంధం లేని ప్రశ్నలతో తెలంగాణ అభ్యర్థులు కలవరపడ్డారు. దీని వెనుక గ్రూప్ -2 ఉద్యోగాలను ఏపీవాళ్లకు కట్టబెట్టే కుట్ర జరుగుతున్నదన్న వాదనలొస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ చరిత్ర పేపర్‌లో ఉద్యమ చరిత్ర ఉండాల్సిన చోట ఆంధ్రా, తెలుగు దేశం, చంద్రబాబులకు సంబంధించిన ప్రశ్నలను చేర్చారని మండిపడుతున్నారు. మార్పు అంటే ఇదేనా? అనవాళ్లు చెరిపేయడం అంటే ఇదేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఇందుకేనా మనం తెలంగాణ తెచ్చుకున్నదని నిలదీస్తున్నారు. ఆంధ్రా బాబు రుణం తీర్చుకునే క్రమంలో రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో మరోసారి తెలంగాణ చరిత్రను చేరిపేసే కుట్ర జరుగుతున్నదని అభ్యర్థులు మండిపడుతున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంపై

గ్రూప్ -2 ప్రశ్నల్లో పాత తెలంగాణ తల్లి విగ్రహంపైనా ప్రశ్నలిచ్చారు. కిరీటం, వడ్డాణంలో కోహినూరు, జాకబ్ వజ్రాల ప్రతిరూపాలను కూర్చారు. మెట్టెలు కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీతో తయారు చేశారు. గద్వాల్, పోచంపల్లి చీరలను పోలిన చీరలో విగ్రహముంది. చేతిలో బోనము పట్టుకుంది అంటూ ఆప్షన్లు ఇచ్చి వీటిలో ఏది సరికాదో ఎంపిక చేయాలని ప్రశ్నను సంధించారు.

ఎకానమీలో ఆ ప్రశ్నలేవీ?

ఉదయం నిర్వహించిన ఎకానమీ పేపర్‌లోను 2014 నుంచి 2024 వరకు గల ప్రశ్నలివ్వలేదు. ఇటీవల ఆర్‌బీఐ నివేదిక కేసీఆర్ సర్కారు పాలన పనితీరును ప్రశంసించింది. అనేక నివేదికల్లో ప్రగతిని కొనియాడింది. కానీ ఎకానమీ ప్రశ్నల్లో 2011- 2013 కాలం నాటి గణాంకాలు, వివరాలపై ప్రశ్నలిచ్చారు. కేసీఆర్ పాలనను కొనియాడటం ఇష్టంలేకే పదేండ్ల ప్రభుత్వ ప్రగతిని ప్రశ్నల్లో ప్రస్తావించలేదని అభ్యర్థులు మండిపడుతున్నారు.

భజన ప్రశ్నలివే (పేపర్ కోడ్ ఎస్) కొన్నింటికి అవునా/కాదా టిక్ చేయాల్సినవి.

ప్రశ్న నంబర్ 72 – చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఆదిలాబాద్ జిల్లాను దత్తతకు తీసుకుని అక్కడ నీటి పారుదల ప్రాజెక్టులను అభివృద్ధిచేశాడు.

ప్రశ్న నంబర్ 87 – చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాలనా వ్యవస్థపై విజన్ 2020 డాక్యుమెంట్‌ను తయారుచేసిన అంతర్జాతీయ సంస్థ ఏది?

పురిటినొప్పులతో పరీక్షకు..

ఉద్యోగం సాధించాలన్న తపనతో ఓ నిండు గర్భిణి గ్రూప్-2 పరీక్షలు రాసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి బల్మూర్ మండలం బాణాలకు చెందిన రేవతి గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వచ్చింది. ఆమె నిండు గర్భిణి కావడంతో వైద్యాధికారులు డెలివరీ డేట్‌ను సోమవారమే ఇచ్చారు. ఉదయం పరీక్షకు హాజరవగా.. పురిటి నొప్పులు రావడంతో అధికారులు కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. మధ్యాహ్నం పరీక్ష ముగిశాక దవాఖానకు తరలించారు. –నాగర్‌కర్నూల్ టౌన్

'గ్రూప్-2'కు 45 శాతమే హాజరు

గ్రూప్ -2 పరీక్ష రెండో రోజు(మంగళవారం) మూడో పేపర్‌కు 45.62 శాతం, నాలుగో పేపర్‌కు 45.57శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు.

ప్రశ్న నంబర్ 123 – 18 అక్టోబర్ 2009న ప్రత్యేక తెలంగాణకు మద్దతుగా టీడీపీ ప్రణబ్‌ముఖర్జీ కమిటీకి లేఖ ఇచ్చింది.

ప్రశ్న నెంబర్ 36 – ఏపీ ఏర్పాటు తర్వాత ఆంధ్రలో 9, తెలంగాణలో 2 పాలిటెక్నిక్‌లు ఏర్పాటయ్యాయి. ఆంధ్రా ఇంజినీర్ అయిన నార్ల తాతారావు రామగుండం థర్మల్ ప్లాంట్‌ను, ఎన్టీపీసీకి అప్పగించడంలో కీలకపాత్ర పోషించారు.

ప్రశ్న నంబర్ 44లో – సీఎం త్రివేది, పీ సుందరయ్య, ఎం హనుమంతరావు, ఏ కాళేశ్వర్‌రావు పేర్లు ఇచ్చి ఏపీ విధానసభ ఉపసభాపతి, ఏపీ విధానమండలి చైర్మన్, ఏపీ విధాన సభ మొదటి సభాపతి, ఏపీ మొదటి గవర్నర్ జతపరచమన్నారు.

ప్రశ్న నంబర్ 51– 4 వాఖ్యానాలిచ్చి జై ఆంధ్ర ఉద్యమానికి సంబంధించి కాలక్రమానుసారం అమర్చండి అంటూ ప్రశ్నిచ్చారు.

ప్రశ్న నంబర్ 57 – సుప్రీంకోర్టులో జీవో-36ను సవాల్ చేసిన ఆంధ్రా ప్రాంతానికి చెందిన సెక్రటేరియట్ ఉద్యోగి ఎవరు?

ప్రశ్న నంబర్ 65 – తెలుగు తల్లి భావనను ప్రచారం చేయడంతో పాటు ట్యాంక్‌బండ్‌పై ఆంధ్రుల విగ్రహాలను ఏర్పాటు చేసి, ఎన్టీ రామారావు తెలంగాణ సమాజ సాంస్కృతిక పునాదులపై దాడిచేశాడు.

ప్రశ్న నంబర్ 66 – టీడీపీ తెలుగు గౌరవం, తెలుగు ఐక్యతను ప్రాచుర్యంలోకి తీసుకొచ్చింది. తెలుగుదేశం వెనుకబడిన కులాలకు, యువ వర్గాలకు దగ్గరయ్యింది.

ప్రశ్న నంబర్ 67 – రాష్ట్ర సచివాలయం సమీపంలో తెలుగుతల్లి విగ్రహాన్ని స్థాపించారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మా తెలుగు తల్లికి మల్లెపూదండ అనే పాటను రచించారు. పబ్లిక్ గార్డెన్స్‌లో తెలుగు వెలుగు మ్యూజియంను ప్రారంభించారు.

ప్రశ్న నంబర్ 92– ల్యాంకో, ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్స్, గాయత్రి ప్రాజెక్ట్స్, మధుకాన్ కంపెనీ – లగడపాటి , కావూరి సాంబశివరావు, టీ సుబ్బరామిరెడ్డి, రాయపాటి సాంబశివరావుల పేర్లు ఇచ్చి కంపెనీలు, యజమానుల్లో సరికాని జతను గుర్తించమన్నారు.

ప్రశ్న నంబర్ 94 – హైదరాబాద్‌లో ఆంధ్రా రియల్ ఎస్టేట్ కంపెనీలు, వాటి యజమానులను జతపరచండి

ప్రశ్న నంబర్ 95 – ఆరు సూత్రాల పథకం ద్వారా తెలంగాణ ప్రాంతీయ బోర్డును తెలుగుదేశం ప్రభుత్వం రద్దుచేసింది.

మలిదశ ఉద్యమ చరిత్రను చెరిపేసే కుట్ర

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

మలిదశ తెలంగాణ ఉద్యమ చరిత్రను చెరిపేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గ్రూప్-2 పరీక్షలో అడిగిన ప్రశ్నల క్లిప్పింగులను జతచేసి ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీశారు. 2009లో ప్రత్యేక తెలంగాణ కోసం ప్రణబ్‌ముఖర్జీ కమిటీకి టీడీపీ మద్దతు ఇచ్చిందా? రాయపాటి సాంబశివరావు, లగడపాటి రాజగోప